క్లుప్తంగా

రోడ్ల పరిశీలన



రొద్దంలో అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి సవిత

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: అధ్వానంగా ఉన్న రోడ్లపై 'ఇవేం రోడ్లు బాబూ' అన్న కథనం సాక్షిలో సోమవారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సోమవారం సాయంత్రం మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లను ఆమె పరిశీలించారు. మండల పరిధిలోని చెరుకూరు నుంచి పెద్దగువ్వలపల్లి, నల్లూరు నుంచి దందేపల్లి క్రాస్ వరకూ దుస్థితిలో ఉన్న రోడ్లను మంత్రి పరిశీలించారు. నల్లూరు నుంచి దందేపల్లి క్రాస్ వరకూ రూ.1.18 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. అదేవిధంగా చెరుకూరు నుంచి పెద్దగువ్వలపల్లి వరకూ రూ.75 లక్షలతో రోడ్డు బాగు చేయనున్నట్లు వివరించారు.

త్వరలోనే అందుబాటులోకి టూరిస్ట్ పోలీసు కేంద్రం



టూరిస్ట్ పోలీసు కేంద్రంపై ఆరా తీస్తున్న చైర్మన్, ఎస్ఐ

లేపాక్షి: లేపాక్షిలోని నంది విగ్రహం వద్ద ఉన్న టూరిస్ట్ పోలీస్ కేంద్రాన్ని వాడకంలోకి తీసుకొస్తామని ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. సోమవారం సాయంత్రం చైర్మన్‌తో పాటు ఎస్ఐ నరేంద్ర, సర్పంచ్ ఆదినారాయణ తదితరులు టూరిస్ట్ పోలీసు కేంద్రంతో పాటు పరిసరాలను పరిశీలించారు. రామానందన్ మాట్లాడుతూ టూరిస్ట్ పోలీసు కేంద్రాన్ని శుభ్రం చేయించి నూతన హంగులతో పర్యాటకుల భద్రతపై దృష్టిసారిస్తామన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



మడకశిర పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందితో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

మడకశిర: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి సమావేశమయ్యారు. మంజువాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలపై ముందుగానే సమాచారాన్ని సేకరించి వాటికి చెక్ పెట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మాధుర్య, శృతి, నరేష్‌కుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మద్యం అక్రమ రవాణా తరలింపునకు అడ్డుకట్ట



ఎక్సైజ్ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ నాగముద్దయ్య

పెనుకొండ రూరల్: కర్ణాటక మద్యంపై గట్టి నిఘా ఉంచాలని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పెనుకొండ ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.
హిందూపురం అర్బన్: మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం దుకాణాల్లో అమ్మకాలు చేయాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య హెచ్చరించారు. సోమవారం హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మహేంద్ర (ఫైల్)

పరిగి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేంద్ర (35) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 18న చిన్నపల్లి సమీపంలో వాహనం అదుపు తప్పి కిందపడినట్లు తెలిపారు. బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయినట్లు చెప్పారు. మృతుడి అన్న కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బకాయిల బాధ !



- ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- విద్యార్థుల మెడపై కాలేజీ యాజమాన్యాల కత్తి
- తీవ్ర ఒత్తిడిలో విద్యార్థుల తల్లిదండ్రులు
- ప్రభుత్వ తీరుపై అన్ని వర్గాల ప్రజల ఆగ్రహం



హిందూపురం టౌన్: అధికారంలోకి రాగానే .. డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు ఫీజురీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తామని యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖామంత్రి నారా లోకేష్ హామీలు గుప్పించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా.. ఆ హామీ అమలు మాత్రం కావడం లేదు. ఈ నేపథ్యంలో ఫీజుల బకాయిలపై కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో వారికి ఏం చేయాలో కూడా పాలుపోని పరిస్థితి నెలకొంది.

గతమెంతో ఘనం


గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి ఫీజురీయింబర్స్‌మెంట్, అమ్మఒడి, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలను అమలు చేస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేసింది. నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కాలేజీ యాజమాన్యాల వద్ద అవమానాలపాలుకాకుండా చర్యలు తీసుకుంది. దీంతో విద్యార్థులు కూడా చదువుపైనే దృష్టిసారిస్తూ మంచి ఫలితాలను సాధించేవారు.

అధికారం చేపట్టి ఆర్నెళ్లు గడిచినా..

ఎన్నికలకు ముందు ప్రస్తుత విద్యాశాఖా మంత్రి లోకేష్‌తో పాటు కూటమి నాయకులందరూ ఫీజురీయింబర్స్‌మెంట్‌పై హామీలు గుప్పించారు. విద్యార్థులకు ఏ కష్టం లేకుండా నిధులు వెను వెంటనే విడుదల చేస్తామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా విద్యార్థులకు విడుదల చేయాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెనను విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కళాశాల యాజమాన్యాల నుంచి ఒత్తిడి

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నమ్ముకున్న విద్యార్థులకు కళాశాల యాజమాన్యాల నుంచి ఒత్తిడి, అవమానాలు తప్పడం లేదు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో దాదాపు 10 వేల మంది విద్యార్థులు డిగ్రీ, పీజీను అభ్యసిస్తున్నారు. వీరికి మూడు క్వాటర్లకు సంబంధించిన ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాల్సి ఉంది.



రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు కోర్సులు పూర్తి చేసినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోలేక ఎన్నో అవస్థలు, అవమానాలు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పీజీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తింపజేస్తూ జీవో నంబర్ 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు తర్వాత పట్టించుకోవడం లేదు. పీజీ విద్యార్థులకు సైతం కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపింది.

పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు

నియోజకవర్గం పేరు	విద్యార్థుల సంఖ్య	విడుదల కావాల్సిన మొత్తం
హిందూపురం	6000	రూ.9 కోట్లు
పెనుకొండ	2200	రూ. 3.3 కోట్లు
మడకశిర	1800	రూ.2.7 కోట్లు

ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు



కళాశాలలో ఫీజులు కట్టకపోవడంతో ఫీజులు కట్టాలని కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తామన్నారు. ఇప్పటి వరకూ ఆ నిధులను మాత్రం విడుదల చేయలేదు. దీంతో కళాశాలలో తమకు ఫీజు కట్టమని ఒత్తిడి చేస్తున్నారు. ఫీజులు చెల్లించాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. మా ఇంట్లో వారు ఫీజు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి.

– రాజు, డిగ్రీ విద్యార్థి, హిందూపురం

జీఓ నంబర్ 77ను రద్దు చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబర్ 77ను రద్దు చేసి ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ఇస్తామని చెప్పారు. ఆరు నెలలు గడిచినా జీవో 77 రద్దుపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కళాశాలల్లో ఫీజులు కట్టాలని చెబుతున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ వస్తుందని ఆశతో ఉన్నాం. అది రాకపోతే ఎంతో మంది ఫీజులు కట్టలేక ఉన్నత చదువులు చదువుకోలేక, చదువును మానేయాల్సిన పరిస్థితి ఉంది.

– తరుణ్, ఎంబీఏ, హిందూపురం

విద్యార్థులను మోసం చేసిన ప్రభుత్వం



డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేసి వారి చదువుకు తోడ్పాటు అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వారికి మొండిచేయి చూపింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 9.5 లక్షల మందికి రూ.2100 కోట్లు ఫీజురీయింబర్స్‌మెంట్ కింద విడుదల చేయాలి. వారి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. కళాశాల యాజమాన్యాల నుంచి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులు ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయి. కొన్ని చోట్ల కోర్సు పూర్తి అయినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. పరీక్ష ఫీజులు కట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.

– బాబావలి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

మహిళా సంఘాల సభ్యుల నిరసన



వెలుగు కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న మహిళలు

అమరాపురం: మండల పరిధిలోని వీరాపురంలోని మహిళా సంఘాల గ్రామైక్య సంఘంలో అవినీతి జరిగిందంటూ ఆ గ్రామంలోని 14 మహిళా సంఘాల సభ్యులు సోమవారం వెలుగు కార్యాలయం ముందు నిరసనకు దిగారు. తమకు తెలియకుండా వివిధ రూపాల్లో రూ.20.4 లక్షల నగదును అధికారులు, ఆనిమేటర్ నగదును డ్రా చేశారని ఆరోపించారు. సొమ్ము రికవరీ చేసి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీ నరసయ్య విచారణ చేసి న్యాయం చేస్తామని ఫోన్ ద్వారా హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

దాడిని ఖండిస్తూ నిరసన

రొద్దం: గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై జరిగిన దాడిని ఖండిస్తూ ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సోమవారం నిరసన తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

11 అర్జీలు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

3 నుంచి నాగలమడక ఉత్సవాలు



సుబ్రహ్మణ్యస్వామి

పావగడ: తాలూకాలోని నాగలమడక గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి జాతరోత్సవాలు జనవరి 3 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. 3న అంకురార్పన, 4న ధ్వజారోహణ, కళ్యాణోత్సవం, 5న బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. 11న మయూర వాహన సేవ మిగతా రోజుల్లో సర్పసేవ పూజలు జరుగుతాయి.

'రాగి'విస్తీర్ణం పెంపుపై అవగాహన

గుడిబండ: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి హేమలత తెలిపారు. మండల పరిధిలోని మోరుబాగల్, తాళికెర గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, రాగి పంట విస్తీర్ణం పెంపుపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

రొళ్ల: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఓటు హక్కు ఉన్న రైతులు తప్పని సరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు తెలిపారు. అన్ని గ్రామాల్లో సచివాలయాల సిబ్బంది ఈ-కేవైసీ నమోదు చేస్తారన్నారు.
మడకశిరరూరల్: మడకశిర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో కంప్యూటరైజేషన్‌లో భాగంగా సొసైటీలో ఓటు హక్కు కలిగిన మండలంలోని రైతులు ఈ- కేవైసీ చేయించుకోవాలని ఆ సంఘం అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీ వెంకటరెడ్డి, సీఈఓ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.
అగళి: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం సభ్యత్వమున్న రైతులు వెంటనే ఈ-కేవైసీ చేసుకోవాలని సహకార సంఘం సీఈఓ బీ.బోజన్న తెలిపారు.

మాటలు.. మంటలు



హిందూపురంలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు



మడకశిరలో నిసరన తెలుపుతున్న సీపీఐ కార్యకర్తలు

- కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై ప్రజా సంఘాల నిరసన

హిందూపురం/హిందూపురం టౌన్/చిలమత్తూరు/మడకశిర: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హిందూపురం పట్టణంలో అంబేడ్కర్ సర్కిల్లో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జెడ్పీ శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ నాయకులు సోమవారం సీపీఐ కాలనీలో అంబేడ్కర్ చిత్రపటాలను ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. సీపీఐ కార్యవర్గ సభ్యుడు మారుతీరెడ్డి, సమీవుల్లా, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు మడకశిర పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యకర్తలు నిరసన చేపట్టారు. సీపీఐ తాలూకా కార్యదర్శి ఆర్‌బీ పవిత్ర మాట్లాడుతూ అమిత్‌షా క్షమాపణ చెప్పి.. తన పదవికి రాజీనామా చేయాలన్నారు. సీపీఎం నాయకుడు రామాంజినేయులు, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు యోగానంద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి పోలీసులే కారణం



న్యాయమూర్తికి వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

పెనుకొండ: అనంతపురంలో న్యాయవాది శేషాద్రి మృతికి పోలీసులే కారణమని పలువురు న్యాయవాదులు సోమవారం సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్‌కు ఫిర్యాదు చేశారు. శేషాద్రిని పోలీసులు భయభ్రాంతులకు గురిచేయడంతో గుండెపోటుతో చనిపోయారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్‌సెల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు న్యాయమూర్తికి వివరించారు. అలాగే అన్నమయ్య జిల్లా గాలివీడు మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డిని కూడా అవమానపరిచారన్నారు. న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాల్మీకి శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, జావేద్, బాలాజి, విక్రాంత్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
పెనుకొండ రూరల్: అనంతపురంలో న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ న్యాయవాదులు డిమాండ్ చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. న్యాయవాది మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్ నాయక్, విశ్వనాథనాయక్, రాజేష్, ప్రేమ సాయి, నరేంద్రరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

లింగణ్ణ ఆశయ సాధనకు కృషి



లింగణ్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పరిగి: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఏఎం లింగణ్ణ ఆశయసాధనకు అందరూ కృషిచేయాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. లింగణ్ణ వర్ధంతి సందర్భంగా సేవామందిరం 81వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. లింగణ్ణ విద్యాసంస్థల అధ్యక్షుడు కేటీ శ్రీధర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కే తిప్పేస్వామి సతీమణి శాంతమ్మ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు వీఎస్ రెడ్డి, మాజీ మంత్రి రఘువీర పలువురు కవులు, రచయితలు పుర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, రచయిత మల్లెల నరసింహమూర్తి రచించిన మాకు ఒక నది కావాలి, తుంబుర కవితా సంపుటాలను రఘువీర చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనవరి 11న విజయవాడ కేంద్రంగా చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్, జిల్లా ఉపాధ్యక్షుడు నూర్ బాషా ఓ ప్రకటనలో కోరారు. వివిధ నిబంధనలతో టీచర్లను ఇబ్బందులు పెడుతున్నారని, అలాగే మధ్యంతర భృతి ఊసేలేదని, సరెండర్ లీవ్ చెల్లింపులు తదితర వాటిని పట్టించుకోవడం లేదన్నారు. ధర్నాలో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ స్టార్టర్ అపహరణ

మడకశిరరూరల్: మండల పరిధిలోని తురుకువాండ్లపల్లి సమీపంలో వ్యవసాయ బోరుకు అమర్చిన విద్యుత్ స్టార్టర్ ఆదివారం అపహరణకు గురైనట్లు బాధిత రైతు జగన్నాథ్ తెలిపారు. ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిబంధనలు పాటించాలి

గుడిబండ: మండల కేంద్రంలోని ఫళారం క్రాస్ వద్ద సోమవారం రాత్రి ఎస్ఐ రాజ కుళ్లాయప్ప, పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన

లేపాక్షి: మండలంలోని వివిధ గ్రామాల్లో కులవివక్షత, అంటరానితం లాంటి సమస్యలను ఎస్సీ,ఎస్టీలు ఎదుర్కొంటుంటే అట్రాసిటీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని మైదుగోళం అంబేడ్కర్ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎస్ఐ నరేంద్ర, వీఆర్ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చెత్తతో సంపద తయారీ వాహనం ప్రారంభం

లేపాక్షి: స్థానిక లేపాక్షి పంచాయతీ కార్యాలయం వద్ద చెత్తతో సంపద వాహనాన్ని గ్రామ సర్పంచ్ ఆదినారాయణ సోమవారం ప్రారంభించారు. పొడి, తడి చెత్త సేకరణ కోసం వాహనాన్ని ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయితీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

పెనుకొండ: పట్టణంలోని తన స్వగృహంలో మంత్రి సవిత సోమవారం ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు కోడూరు శ్రీనివాసులు, రఘు, జవ్వాజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

గుడిబండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగాధర్ తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తివిద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు జిల్లా ఓజేటీ కమిటీ సభ్యులు ప్రభాకర్, శ్రీనివాసులు ఆయా కోర్సులకు సంబంధించి సూచనలు, సలహాలిచ్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



జల్లప్ప (ఫైల్)

రొద్దం: మండల పరిధిలోని గోనిమేకులపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉప్పర జల్లప్ప (55) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

సమస్యలపై దృష్టి పెట్టండి

మడకశిర: మున్సిపల్ అధికారులు సమస్యలపై దృష్టి పెట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ మీట్ జరిగింది. చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షత జరిగిన సమావేశంలో వార్డుల వారీగా సమస్యల పై చర్చించారు. తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యల పై ఆరా తీశారు. పలువురు కౌన్సిలర్లు సమస్యలను చైర్ పర్సన్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ అధికారులు సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



మధూడి నుంచి దొక్కలపల్లికి జ్యోతులు మోస్తున్న భక్తులు



అలంకరణలో ఏడుగురు అమ్మవార్లు, బొమ్మలింగేశ్వరస్వామి

అగళి: మండల పరిధిలోని దొక్కలపల్లి గ్రామ సమీపంలోని అక్కగార్ల దేవరపల్లి పొలిమేరలో వెలసిన ఏడుగురు అమ్మవార్లు, బొమ్మలింగేశ్వరస్వామికి జ్యోతుల ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మధూడి, కరిదాసనపల్లి, కదిరేపల్లి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు అమ్మవార్లను, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధూడి, కరిదాసనపల్లి, కదిరేపల్లి గ్రామం నుంచి ఏడుగురు అమ్మవార్లు బొమ్మలింగేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.